మద్యం కిక్కు..ఎవరిదో లక్కు!

- ఎమ్మిగనూరు నియోజకవర్గానికి 15 మద్యం దుకాణాల కేటాయింపు
- షాపుల టెండర్ల కోసం పోటాపోటీ
- రాజకీయ దళారుల రంగప్రవేశం
- అదృష్టం పరీక్షించుకునేందుకు రియల్ వ్యాపారుల ఎత్తులు
- రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ



మద్యం దుకాణం

ఎమ్మిగనూరు: మద్యప్రియులను మత్తులో ముంచి అందినకాడికి దోచేందుకు అధికారికంగా రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పర్యవేక్షణలో అక్రమాలకు తావులేకుండా సాగిన మద్యం వ్యాపారం ఇకపై ప్రవేట్ వ్యక్తుల దందాలకు వేదికగా మారనుంది. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి 15 మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో 8 దుకాణాలు, ఎమ్మిగనూరు మండలంలో 3, నందవరం మండలంలో 2, గోనెగండ్ల మండలంలో 2 షాపులను ఏర్పాటు చేస్తారు. టెండర్లలో పాల్గొనే వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు (నాన్ రీఫండ్) చెల్లించాలి. ఏడాది రుసుం రూ.65 లక్షలు, అటు తరువాత ఏడాది రూ.71,50,000 ప్రభుత్వానికి చెల్లించాలి.

రంగంలోకి రాజకీయ పైరవీకారులు..

రాజకీయ పార్టీ నేతలకు ఆదాయ వనరైన మద్యం షాపులను దక్కించుకొనేందుకు రాజకీయ పైరవీకారులు రంగప్రవేశం చేశారు. నేతల పేర్లు చెప్పుకొంటూ వివిధ పార్టీల చోటనేతలు షాపులు తమవేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రియల్ రంగంలో కోట్లు వెనకేసుకున్న రియల్టర్లు కూడా మద్యం షాపుల కోసం పావులు కదుపుతున్నారు. అధికార బలం,అంగబలం ఉన్న నేతలు ఇతరులను నయానో,భయానో దారిలోకి తెచ్చుకునేందుకు యత్రాలు ప్రారంభించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం వారే కాకుండా కర్నూలు,నంద్యాల,గద్వాల ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మద్యం షాపుల కోసం మంతనాలు జరుపుతున్నారు.

ఎవరైనా పాల్గొనవచ్చు



మద్యం షాపులను మంజూరు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దుకాణాలను దక్కించుకోవాలనుకొనే వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మద్యం షాపులకు ఎక్కువ మంది పోటీపడే అవకాశం ఉంది. లాటరీ పద్ధతిలో నిర్వాహకులను ఎంపిక చేస్తారు.

– రమేష్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ

ఎమ్మిగనూరు మద్యం షాపులకు కిక్కు ఎక్కువే..

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మద్యం షాపులకు డిమాండ్ అధికంగానే ఉంటుంది. మద్యం షాపులను సిండికేట్‌గా మార్చి భారీ స్థాయిలో ప్రజల సొమ్మును దోచుకొన్న వ్యాపారులపై గతంలో ఏసీబీ కేసులు కూడా నమోదయ్యాయి. మద్యం వ్యాపారులకు అండగా నిలిచే క్రమంలో ఇద్దరు సీఐలు సస్పెండ్ అయ్యారు. మరొకరు లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కారు. నియోజకవర్గంలోని 15 షాపులకు పోటీ తీవ్రంగా ఉంది. ఒక్కోషాపునకు 10 నుంచి 15 మందికి పైగా పోటీ పడే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖలో చర్చ నడుస్తోంది. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసే డిప్‌లో లక్కు ఎవరిదో.. మద్యం కిక్కు ఏపాటిదో తెలియనుంది. విజయదశమి రోజు లక్కీడ్రా విజేతలు నూతన మద్యం షాపులకు శ్రీకారం చుట్టనున్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కై రవాడి గ్రామంలోని హంద్రీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ శుక్రవారం రాత్రి హంద్రీలోని ఇసుకను లోడ్ చేసుకొని తరలిస్తుండగా దాడి చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని వెంకటేష్‌పై శనివారం కేసు నమోదు చేశామని చెప్పారు. అధికారుల అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బాలుడికి పాము కాటు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని కడివెళ్ల గ్రామంలో శనివారం వడ్డె వీరేంద్ర (12) అనే బాలుడు పాము కాటుకు గురయ్యాడు. తండ్రి వడ్డె శివతో కలసి పత్తి పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కేకలు వేస్తూ తండ్రికి చెప్పటంతో చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

దూదేకులకు సమాన హక్కులు కల్పించాలని వినతి

ఆదోని అర్బన్: ముస్లీం, మైనార్టీలతో పాటు దూదేకులకు సమాన హక్కులు కల్పించాలని రాష్ట్ర దూదేకుల సంఘం నాయకుడు పి.సాయిబాబు ఏపీ మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఫరూక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఉండవల్లిలో మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు.

క్లుప్తంగా

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు



కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చెత్త సేకరణ, కంపోస్ట్ యార్డ్‌కు తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక సోగనూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో నిలువ చేసిన చెత్తతో వర్మీకంపోస్ట్ తయారీపై సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త, చెదారంతో దుర్గంధం వెదజల్లుతుండటంపై సిబ్బందికి సూచినలిచ్చారు. అలాగే.. కూరగాయల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదని వ్యాపారులకు సూచించారు. మున్సిపల్ డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

సేవలకు సత్కారం



ఆల్‌ఫ్రెడ్ రాజును సత్కరించిన ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడ వరద బాధితులకు అక్కడికి వెళ్లి సేవలందించిన మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజును శనివారం ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు సత్కరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్లబ్ సభ్యులు, క్రీడాకారులు ఆయనను శాలువా,పూలమాలతో సత్కరించి మాట్లాడారు. సేవా దృక్పథంతో దాదాపు రూ.10 లక్షల విలువజేసే నిత్యావసర సరుకులు, దుస్తులు,దుప్పట్లు ఆహార పదార్థాలను బాధితులకు అందించారని అభినందించారు. వైఎఫ్‌సీ సభ్యులు విక్రమ్, ముని,రఘు, ఈరన్న, నసరుల్లా బేగ్ పాల్గొన్నారు.

రైల్వే ఎస్‌ఐ గోపాల్‌కు ప్రశంసాపత్రం



డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గోపాల్

ఆదోని సెంట్రల్: మహిళను కదులుతున్న రైలు నుంచి తోసివేసిన కేసును ఛేదించిన బృందంలోని ఆదోని రైల్వే ఎస్‌ఐ గోపాల్ డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా శనివారం ప్రశంసా పత్రం అందుకున్నారు. గుంతకల్లు రైల్వేస్టేషన్ పరిధిలోని కదిరి రైల్వే స్టేషన్ సమీపంలో వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తున్న మహిళను ఓ అగంతకుడు మెడలో చైన్ లాక్కొని కదులుతున్న రైలు నుంచి తోసేశాడు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న ప్రత్యేక బృందంలో ఈయన సభ్యుడిగా ఉన్నారు.

లారీ ఢీ.. బాలుడికి తీవ్ర గాయాలు



లారీ కింద బైక్ పడడంతో పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో ఉన్న బైపాస్ వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బి.ఎం.సూగూరు గ్రామానికి చెందిన బసవరాజు, జయదీప్(6) శనివారం ఆస్పరి మండలం హలిగేర గ్రామానికి వెళ్తున్నారు. పెట్రోల్ బంకు వద్ద లారీ బైకును ఢీకొనడంతో బాలుడు జయదీప్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



శాంతిరాజును పరామర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోని రూరల్: శాంతిరాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శాంతిరాజును శనివారం ఆయన పరామర్శించారు. పంట పొలంలో అడ్డంగా ట్రాక్టర్‌ను తీసుకెళ్లడమే కాకుండా ఎందుకిలా చేశారని ప్రశ్నించిన శాంతిరాజుపై ట్రాక్టర్ డ్రైవర్ అంజి దాడి చేశాడని ఆరోపించారు. వెంటనే అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ

ఆదోని టౌన్: టీబీ (క్షయ)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎంపీహెచ్ఎస్ బాబురాజు అన్నారు. శనివారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. టీబీ కేసులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ లక్షణాలు ఉన్న వారు గల్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రేను ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వ్యాధిగ్రస్తుడికి ఉచితంగా మందులను ఆరు నెలలపాటు అందజేస్తూ, ఖర్చులకు ప్రతి నెలా రూ.500 చొప్పున ఆరు నెలలపాటు చెల్లిస్తామన్నారు. టీబీ రోగులు మంచి పౌష్టికాహారం తీసుకుని, వైద్యుల సలహాలు పాటిస్తే జబ్బు నయమవుతుందన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మోచేతిని అడ్డుగా పెట్టుకోవాలన్నారు. ఇంట్లోని కుటుంబ సభ్యులకు కూడా జబ్బు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది మల్లికార్జున, సుబ్బమ్మభాయి, పద్మావతి పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆదోని సెంట్రల్: పాడి రైతులు పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు చిటుకు, గాలికుంట వ్యాధులతో పాటు ముద్దచర్మ రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. పశువుల పాకశాలలు అపరిశుభ్రంగా ఉన్నా, కలుషితమైన నీరు తాగినా రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పశువులు, గొర్రెలు, మేకల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉండాలని సూచించారు. తగిన జాగ్రతలు తీసుకోకుంటే వాటి ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గొర్రెలు, మేకలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను అందిస్తున్నామని తెలిపారు. గొంతు వాపు, గాలికుంటు, చిటుకు వ్యాధులకు చర్మ రోగానికి ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నామని తెలిపారు. పశువులు ఎద్దైనా అనారోగ్యం బారిన పడితే దగ్గరలో ఉన్న స్థానిక పశువైద్యులను సంప్రదించి తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలపై భారం మోపే విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం మండల నాయకుడు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు.శ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను ఎట్టి పరిస్థితుల్లోను పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత సర్‌చార్జీల పేరుతో చార్జీలు పెంచేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సంవత్సరానికి రూ.8,113 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలికి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సమీవుల్లా, దాదావలి, కెసి జబ్బార్, విరూపాక్షి నాయుడు, వీరేష్, తిమ్మగురుడు,విజయేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంపై దృష్టి సారించండి

- ఎస్పీ బిందుమాధవ్



ఎస్పీకి గౌరవ వందనం చేస్తున్న సీఐలు

ఆదోని అర్బన్: దొంగతనం కేసులో నష్టపోయిన ప్రాపర్టీని 80 శాతం వరకు రికవరీ చేయాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సోమన్న,, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌లకు క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న క్రైమ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్యాంబ్లింగ్, మట్కా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సీఐలు శ్రీరామ్, సూర్యమోహన్‌రావు, రామలింగప్ప, విక్రమసింహా, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సభ్యత్వం కోసం ప్రజలను మభ్యపెట్టడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా

ఆదోని టౌన్: బీజేపీ సభ్యత్వం కోసం ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, ఎస్సీ సెల్ కార్యదర్శి గంగాధర్ ఆరోపించారు. శనివారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఏ పార్టీకి అయినా సభ్యత్వ నమోదు తప్పనిసరి అన్నారు. అయితే బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కోసం ఓటీపీ నంబర్లు అడుగుతున్నారని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధి పొందవచ్చని చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇది ఎంతవరకు సమంజసమన్నారు. ఓటీపీ నంబర్ ఎవరూ చెప్పొద్దని, ఏ పార్టీ అయినా సభ్యత్వ నమోదు చేస్తుందే తప్పా ఇలా ఓటీపీ నంబర్‌లు సేకరించరనే వాస్తవాన్ని ప్రజలు గమనించాలన్నారు. నాయకులు రామక్రిష్ణ, లక్ష్మన్న, భాస్కర్, బాబా, రమేష్, యాసిన్ ఉన్నారు.

వరుసగా పైపులైన్ లీకేజీలు

- వృథా అవుతున్న తాగునీరు



భీమాస్ సర్కిల్‌లో పైపులైన్ లీకేజీ గుంతను తవ్వుతున్న జేసీబీ

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో ఇటీవల పైపులైన్‌ల లీకేజీలు అధికమవుతున్నాయి. ప్రధాన రోడ్లు, కూడళ్లు, శివారు ప్రాంతాల్లో లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో తాగునీరు వృథాగా మురుగుకాలువ పాలవుతున్నాయి. పకడ్బందీగా లీకేజీలను సరి చేయడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో లీకేజీలు పెరిగిపోతున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీల మరమ్మతుల కోసమే ఏటా లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారే తప్పా వాటికి శాశ్వత మార్గం చూపడంలేదన్న విమర్శలు ఉన్నాయి. పాత బస్టాండ్ సర్కిల్, భీమాస్ సర్కిల్, తిక్కస్వామిదర్గా సర్కిల్, ఎమ్మిగనూరు టర్నింగ్, కాలేజీ ఏరియా, కల్లుబావి ఏరియాలో పైపులైన్ లీకేజీలు నిత్యం అవుతూనే ఉంటాయి. నెలకోసారి లీకేజీలకు మరమ్మతులు చేయాల్సిందే. ప్రజాధనం ఖర్చు పెట్టాల్సిందే. ఇలా అయితే తాగునీరు ప్రజలకు సమృద్ధిగా చేరేదెన్నడూ, ప్రజాధనం ఆదా చేసేది ఎప్పుడూ అంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైపులైన్ల విడి భాగాలు నాణ్యతగా లేకపోవడం వల్లనే వరుసగా లీకేజీలు అవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవున్నాయి.

మండల అభివృద్ధికి సహకరించండి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దకడబూరు : అధికారులు మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు అవడంపై అసహనం వ్యక్తం చేశారు. రాబోయే సమావేశానికి అధికారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. రాజకీయ పార్టీలు ముఖ్యం కాదని, అభివృద్దే ప్రధానమన్నారు. పార్టీలకు అతీతంగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాగే.. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్పందించాలన్నారు. సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కల్లుకుంట, దొడ్డిమేకల తదితర గ్రామాలకు విద్యార్థి బస్సు సక్రమంగా రావడం లేదని సభాదృష్టికి రావడంతో స్పందించిన ఎమ్మెల్యే.. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఇరిగేషన్ జేఈ రంగస్వామి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు ముత్తమ్మ, ఇర్ఫాన్ దేశాయ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పేదలకు లాభాదయకం

మండల, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం పేదలకు లాభదాయకమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదోని మధు హాస్పిటల్ ఆధ్వర్యంలో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు డబ్బులు పెట్టి వైద్య పరీక్షలు నిర్వహించుకోలేక చాలామంది ఆకస్మికంగా తనువు చాలిస్తున్నారన్నారు. సుమారు 160 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, డాక్టరు విశ్వనాథ్, దేవనగౌడ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరుకున్న దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: కల్లుకుంట్ల గ్రామంలో తనపై దాడి చేసిన సంఘటనలో నిందితులందరిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గోవిందమ్మ స్థానిక సోమప్ప సర్కిల్‌లో చేపట్టిన నిరవధిక దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. శనివారంర ఆమె దీక్షకు ఏపీ ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు, సమతా సైనిక్ దళ్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఆయా సంఘాల నాయకులు పార్లపల్లె జయన్న, మాలనర్సన్న, రంగయ్య మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం, బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ మంచాల లక్ష్మీనారాయణ, మాలమహానాడు నాయకులు నాగేంద్ర,గడ్డం హుసేని పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని డీఎస్పీ ఉపేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని వైష్ణవి గ్రూప్స్ నిర్వహిస్తున్న ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ కళాశాలల ఫ్రెషర్స్ డేను శనివారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించారు. కళాశాలల చైర్మన్ గడిగె లింగప్ప, అకడమిక్ చైర్మన్ విష్ణుప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కళాశాలలో ఈవ్‌టీజింగ్‌కు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకొని చదవాలని అప్పుడే ఉన్నత కొలువులు సాధించేందుకు సాధ్యమౌతుందన్నారు. అనంతరం విద్యార్థినిలు ధార్మిక,జానపద సాంస్కృతిక ,సినీ గేయాలకు చేసిన నృత్య ప్రదర్శన అకట్టుకుంది. పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, కరస్పాండెంట్ సత్యసిరి, డైరెక్టర్లు జ్ఞానసాయికృతి,అకాడమీ కోఆర్డినేటర్ రవీంద్రనాయక్, ప్రిన్సిపాళ్లు కుమారస్వామి, మధుబాబు, మునెప్ప పాల్గొన్నారు.

భవానీ భక్తుల మాలధారణ

ఆదోని అర్బన్: స్థానిక అంబా భవానీ ఆలయంలో పలువురు భక్తులు శనివారం భవానీ మాల వేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జై భవానీ.. జైభవానీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. 2005 నుంచి తాము భవానీ దీక్ష చేపడుతున్నామని, 19 ఏళ్లు పూర్తి అయ్యిందని మాలధారులు తెలిపారు.

గాయత్రీ దేవిగా పార్వతీదేవి



పెద్దకడబూరు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భా శనివారం మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో వెలసిన పార్వతీదేవి గాయత్రీ విగా దర్శనమిచ్చారు. అలాగే మండల కేంద్రంలో వెలసిన కాళికాదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. చౌడేశ్వరిదేవి, లక్ష్మమ్మవ్వ వివిధ రూపాలలో కనువిందు చేశారు. ఆలయ పూజార్లు వీరభద్రయ్య, నరసింహాచారి ఉదయం అమ్మవార్లకు కుంకుమార్చన, బిల్వార్చన, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు చంద్రఘంట దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వేకువ జామునుంచి అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు. సాయంకాలం ఆలయ ప్రాంగణంలో దేవి పురాణం చదివి భక్తులకు వినిపించారు.



నందవరం : మండలంలోని సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పుహితులు శ్రీధర్ స్వామి ఆధ్వర్యంలో గ్రామంలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.



ఎమ్మిగనూరుటౌన్: దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ పాండు రంగస్వామి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తునా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు.అలాగే పట్టణంలోని వేదగాయత్రీ దేవి, తేరు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారు, గోనెగండ్ల రోడ్డులోని అంభాభవానీ ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు.



నవధాన్యాలతో దర్శనమిస్తున్న లక్ష్మమ్మవ్వ



ఆదోని: గోవిందుడి అంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి



నవధాన్యాల అలంకారంలో పేట వీరభద్రేశ్వరస్వామి

అన్నపూర్ణేశ్వరీ పాహిమాం

ఆదోని అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా ఆయా దేవతల అలంకరణలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పించారు.



అన్నపూర్ణేశ్వరిగా గంగాభవానీ

జోరుగా పూడికతీత పనులు



రైల్వేస్టేషన్ రోడ్డులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలో పూడికతీత పనులు జోరుగా జరుగుతున్నాయి. శనివారం కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ సిబ్బంది పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, విక్టోరియాపేట, పాత బస్టాండ్ ఏరియా, టీజీఎల్ కాలనీ, రైల్వేస్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ముళ్లకంపలను ఎప్పటికప్పుడు తొలగించాలని మేస్త్రీలకు సూచించారు. పాత ఓవర్ బ్రిడ్జి వద్ద చెత్తాచెదారం, కొబ్బరి బోండాలతో పూడుకుపోయిన మెయిన్ కాలువలను కమిషనర్ దగ్గరుండి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేసి అపరిశుభ్రం, బ్లాక్ చేయొద్దని ప్రజలకు సూచించారు. ఇళ్ల వద్దకు వచ్చే తోపుడు బండ్లు, చెత్త బండ్లలో వేసి పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.